క్లుప్తంగా

లబ్ధిదారులకు చెక్కులు అందజేత



పాల్వంచ: చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

సూపర్‌బజార్(కొత్తగూడెం): పేదవర్గాల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పేదలకు, పల్లె ప్రజలకు వీటిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో మంగళవారం జరిగిన సీఎం రిలీఫ్‌ఫండ్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌కు సంబంధించిన రూ.44.28 లక్షల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడారు. ఎస్‌కే సాబీర్‌పాషా, సలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాస్, జమలయ్య పాల్గొన్నారు.

పాల్వంచ: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తహసీల్దార్ దారా ప్రసాద్, ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇఫ్టూ ఆధ్వర్యంలో ధర్నా



మాట్లాడుతున్న సంజీవ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ కంపెనీ లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు 15శాతం కేటాయించాలని ఈనెల 11న సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ఇఫ్టూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నామని ఆ యూనియన్ రీజియన్ కార్యదర్శి ఎస్.సంజీవ్ తెలిపారు. మంగళవారం కొత్తగూడెంలోని సంఘం కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం అన్ని విభాగాలలో కాంట్రాక్ట్ కార్మికులను నియమించి అతితక్కువ వేతనాలు చెల్లించటం వల్లనే కంపెనీకి రూ.కోట్ల లాభాలు వస్తున్నాయని, అదే పర్మనెంట్ కార్మికులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులకు కూడా వేతనాలు చెల్లించి ఉంటే ఇంత లాభాలు వచ్చేవి కావన్నారు. పర్మనెంట్ కార్మికులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని వారితో సమానంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం తలపెట్టిన ధర్నాలో కాంట్రాక్ట్ కార్మికులు అధికంగా పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జేబీపీ అసెంబ్లీ అధ్యక్షుడిగా రవికుమార్

కొత్తగూడెంఅర్బన్: జై భీమ్‌రావు భారత్ పార్టీ (జేబీపీ) కొత్తగూడెం అసెంబ్లీ అధ్యక్షుడిగా కొత్తగూడెం గంగబిషన్ బస్తీకి చెందిన నాగుల రవికుమార్‌ను మంగళవారం జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యర్రా కామేష్ నియమించారు. కామేష్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబా పూలే వ్యాఖ్యలను బహుజనులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సమానత్వం, హక్కుల కోసం ధైర్యంగా పోరాడాలని పేర్కొన్నారు. రవికుమార్ మాట్లాడుతూ పార్టీ బలోపేతం కృషి చేస్తానని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజలను చైతన్యపరిచి, ప్రజా ఉద్యమాలు చేపడతామన్నారు.

గిరిజన గురుకులంలో అరకొర వసతులు

- విద్యార్థులు సమస్యలతో సతమతం
- డిసెంబర్‌లో గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు
- కిన్నెరసాని ప్రభుత్వ గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలను పట్టించుకోని అధికారులు



కిన్నెరసాని గురుకుల పాఠశాల

పాల్వంచరూరల్: విద్యార్థులపై ఇంత నిర్లక్ష్యమా.. అని గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీస సౌకర్యాలు కూడా కరువవడంతో అవస్థల నడుమ, చాలీచాలనీ గదుల్లో చదువుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. తరగతి గదిలోనే మధ్యాహ్నం చదువుకుంటూ, రాత్రివేళ పడుకోవాల్సిన పరిస్థితి. మరోపక్క స్కూల్, కళాశాల చుట్టూ ప్రహరీ లేక, భోజనశాల శిథిలావస్థకు చేరడం, తరగతి గదులు కురుస్తుండటంతో విద్యార్థులు చదువులపై దృష్టి సారించలేకపోతున్నారు. మండలంలోని కిన్నెరసాని డ్యామ్‌సైడ్‌లో ఏపీ రెసిడెన్సీ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ రెసిడెన్సియల్ బాలుర స్కూల్‌ను 1976 డిసెంబర్ 25న సంజయ్‌గాంధీ, అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి జలగం వెంగళరావు శంకుస్థాపన చేసి ఏడాది తర్వాత ప్రారంభించారు. మొదట స్కూల్, తర్వాత కళాశాలగా అప్‌గ్రేడ్ అయినా గురుకుల ప్రతిభా కళాశాలలో అరకొర సమస్యలు విద్యార్థులను వేధిస్తున్నాయి. ఈ రెసిడెన్సి స్కూల్‌లో ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులందరూ ఇదే స్కూల్‌లో చదువుకునేవారు. ప్రైవేట్ స్కూల్‌కు దీటుగా ఇక్కడి విద్యార్థులు ఫలితాలను సాధించేవారు. మెరిట్ ఉంటే తప్ప ఇక్కడ సీటు లభించని పరిస్థితి ఉండేది.

ఐఏఎస్, ఎస్ఆర్‌బిలుగా పూర్వవిద్యార్థులు ..

కిన్నెరసాని డ్యామ్‌సైడ్ గిరిజన గురుకుల పాఠశాల ఎంతోమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దింది. ఇక్కడ చదువుకున్న అనేక మంది గిరిజన విద్యార్థులు నేడు దేశ, విదేశాలల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులు, అధికారులు, ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో అనేక మంది ఇక్కడి పూర్వ విద్యార్థులే.

వేధిస్తున్న సమస్యలు...

ప్రస్తుతం గురుకుల పాఠశాల, కళాశాలను అనేక సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. 500 మందికి పైగా గిరిజన విద్యార్థులు చదువుకుంటున్న గురుకులంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేవు. శిథిలావస్థకు చేరిన భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. పైకప్పు సిమెంట్ రేకులు పగిలి వర్షాకాలంలో వర్షం వస్తే కురుస్తున్నాయి. దీంతో విద్యార్థులు చదువుకోలేని దుస్థితి. భోజనాలు చేసే భవనం కూడా శిథిలావస్థకు చేరింది. దీనికి తోడు పాఠశాల, కళాశాల చుట్టూ ప్రహరీ కూలిపోవడంతో పశువులు, గొర్రెలు, మేకలు కళాశాల ప్రాంగణంలో సంచరిస్తుంటాయి. అంతే



గదుల పైకప్పుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కాకుండా గురుకుల పాఠశాలలో కోతల బెడద తీవ్రంగా ఉంది. తరగతి గదులపై కోతులు గంతులు పెడుతుండంతో పైకప్పు రేకులు పగిలిపోయాయి. విద్యార్థులను వెంటబడి కరుస్తున్నాయి.

డిసెంబర్‌లో స్వర్ణోత్సవాలు...

గిరిజన గురుకుల కళాశాలను స్థాపించి 50 ఏళ్లు దాటిన సందర్భంగా ఈ ఏడాది డిసెంబర్‌లో స్వర్ణోత్సవాలు జరుపుకోవాలని పూర్వవిద్యార్థులు కసరత్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పలువురు పూర్వవిద్యార్థులు ఈ వేడుకలకు తరలిరానున్నారు. ఇందుకోసం ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఇతర సిబ్బంది ఏర్పాట్ల ప్రయత్నాల్లో ఉన్నారు.

అదనపు గదులు నిర్మించాలి...



కిన్నెరసాని గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేవు. చదువుల కోసం విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అదనపు తరగతి గదులు మంజూరు చేయాలి. – ఎస్.మహేందర్, 9వ తరగతి

కొత్త భోజనశాల ఏర్పాటు చేయాలి..



కిన్నెరసాని డ్యామ్‌సైడ్‌లోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలకు చెందిన భోజనశాల 50 సంవత్సరాల క్రితం నిర్మాణం చేయడంతో శిథిలావస్థకు చేరి కురుస్తోంది. కొత్త భవనం మంజూరు చేయాలి. – టి.రేవంత్, 9వ తరగతి

ప్రతిపాదనలు పంపించాం..



గురుకుల పాఠశాల సమస్యల పరిష్కారానికి గురుకుల కమిషనర్‌కు, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, సీతక్క, ఎమ్మెల్యేలకు విన్నవించాము. ప్రతిపాదనలు పంపించాము. – శ్యామ్‌కుమార్, ప్రిన్సిపాల్, కిన్నెసాని పాఠశాల

చడీచప్పుడు లేకుండా జోనల్ క్రీడలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: ఇల్లెందు జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో మూడు మండలాల స్థాయి పాఠశాలల విద్యార్థుల క్రీడాపోటీలు గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్నారు. ఇటీవల మండల స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. ఇదిలా ఉండగా గుండాల, ఆళ్లపల్లి, ఇల్లెందు, టేకులపల్లి మండలాల జోనల్ స్థాయి క్రీడా పోటీలు మంగళవారం సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. మండలంలోని అన్ని పాఠశాలలకు సమాచారం లేకుండా కొన్ని పాఠశాలలకు మాత్రమే సమాచారం ఇచ్చి తూతూ మంత్రంగా ముగించే యత్నం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎంఈఓ ఉమాశంకర్ బాధ్యతలు తీసుకున్న తర్వాత ఎంఈఓ కార్యాలయానికి రాకుండా సుభాష్‌నగర్ హైస్కూల్‌లోనే శిక్షణలు, సభలు, సమావేశాలు ముగించేస్తున్నట్లు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. మంగళవారం సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో విద్యార్థుల జోనల్ స్థాయి క్రీడా పోటీలను డీఎస్పీ చంద్రభాను ప్రారంభించారు. ఎంఈఓ ఉమామహేశ్వరరావు, పాఠశాలల హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీఈటీలు పాల్గొన్నారు.

డబ్ల్యూపీఎస్ జీఏ కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులను జీఎంకు పరిచయం చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో నూతనంగా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ (డబ్ల్యూపీఎస్ జీఏ) నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏరియా జీఎం శాలేం రాజు, ఉపాధ్యక్షుడిగా ఏస్ఓటూ జీఎం కోటిరెడ్డి, సమన్వయకర్తగా డీజీఎం పర్సనల్ మోహన్‌రావు, గౌరవ కార్యదర్శిగా జి.హరీష్, సహాయ క్రీడా పర్యవేక్షకుడిగా ఎంసీ పాసినెట్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి.భీముడు, క్రీడా సమన్వయకర్తగా వీరితో పాటు మరో 16 మందిని కెప్టెన్లుగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను ఏరియా జీఎంకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ 10న వార్షిక క్రీడలు కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్‌తో ప్రారంభించడం జరుగుతుందని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రజాక్, మల్లికార్జున్‌రావు, ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి, డీజీఎం మోహన్‌రావు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమ శిఖరం ఏచూరి



టేకులపల్లి: మాట్లాడుతున్న శ్రీనివాస్

ఇల్లెందు: సీపీఎం ఆలిండియా ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఉద్యమ శిఖరం అని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఏజే రమేష్ అన్నారు. మంగళవారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ జరిగింది. రమేష్ మాట్లాడుతూ సోషలిజం నిర్మాణ స్థాపనకు విద్యార్థి దశ నుంచి తుది శ్వాస వరకు ఏచూరి కృషి చేశారని తెలిపారు. మతోన్మాదంపై పోరాట పంథాను నిర్ణయించి పార్టీ శ్రేణులను పోరాటాలకు పురిగోల్పాడని కొనియాడారు. అటువంటి మహానేత మన మధ్య లేకపోవటం సీపీఎంకు నష్టం అన్నారు. ఈ కార్యక్రమంలో నబీ, కిరణ్, కృష్ణ, మోహన్‌రావు, సుల్తానా, మాదారపు వెంకటేశ్వర్లు, సంధ్య, ఖాదర్, వాసం రాము, లక్ష్మి, బోస్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: సీపీఎం జాతీయ మాజీ కార్యదర్శి, అమరజీవి సీతారాం ఏచూరి ఆశయాల సాధనకు అందరూ ఉద్యమించాలని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రేపాకుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం లచ్చగూడెం గ్రామంలో ఏచూరి ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈసం నర్సింహారావు, కడుదుల వీరన్న, పూనెం స్వామి, చంద్రశేఖర్, దొడ్డ సంపత్‌కుమార్, దొడ్డ సావిత్రి, కోటేశ్వరరావు, కుంజ రమేష్, భారతమ్మ, చుక్కమ్మ పాల్గొన్నారు.

ఆలయానికి సోలార్ సామగ్రి అందజేత

ఇల్లెందు: పట్టణంలోని శ్రీ హరిహర క్షేత్రానికి సోలార్ పవర్ ఏర్పాటుకు సహకారం అందించేందుకు పట్టణానికి చెందిన ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు ముందుకు రావటం పట్ల ఎమ్మెల్యే కోరం కనకయ్య, శ్రీహరిహర క్షేత్రం ఆలయ కమిటీ చైర్మన్ గందె సదానందం అభినందించారు. మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రూ.2 లక్షల విలువ చేసే సోలార్ పవర్ మెటీరియల్‌ను చైర్మన్‌కు అప్పగించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు రమేష్, విజయ, వర్మ, నాయకులు డానియేల్, చిట్టిబాబు, మండల రాము, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, సుదర్శన్ కోరి, అనుబాబు, పింగళి నరేష్, ఈఓ సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

తెలంగాణ అస్థిత్వ పోరాటమే కాళోజీ జీవితం



ఇల్లెందు: నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ప్రజాకవి కాళోజీ నారాయణరావు 111వ జయంతిని మంగళవారం ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పార్టీ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ తెలంగాణ భాష, అస్థిత్వ పోరాటమే కాళోజీ జీవితమని, ఉద్యమ ప్రతిధ్వనిగా నిలిచిచారని కొనియాడారు.
– సాక్షి నెట్‌వర్క్



కొత్తగూడెంఅర్బన్: గ్రంథాలయంలో..



జూలూరుపాడు: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో



చుంచుపల్లి: నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, సిబ్బంది



సింగరేణి జీఎం కార్యాలయంలో...



సుజాతనగర్: నివాళులర్పిస్తున్న అధికారులు



విజేతకు బహుమతి అందజేస్తున్న ఆర్‌సీఓ అరుణకుమారి



ఇల్లెందురూరల్: నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

బాధ్యులను కఠినంగా శిక్షించాలి

కొత్తగూడెంటౌన్: ఖమ్మం జిల్లా సీనియర్ న్యాయవాదిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ జనపరెడ్డి గోపీకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తగూడెం జిల్లా కోర్టులోని లైబ్రరీ హాల్‌లో జరిగిన సమావేశంలో గోపీకృష్ణ మాట్లాడారు. జాహిర్ అలీపై ఆయన చాంబర్‌లోనే కొంతమంది దుండగులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుంకర భానుప్రియ, ఎర్రపాటి కృష్ణ, మారపాక రమేష్, వడ్లకొండ హరి, డి.సామంత్ మహ్మద్ సాధిక్ పాషా, ధరావత్ రాధాకృష్ణ, అంకుష్ పాషా, దేవేంద్ర వరకుమార్, బేబీ షామిలి, నీలవేణి, నందిని, ఉమ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యాబోధన చేయాలి



ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

జూలూరుపాడు: విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం జూలూరుపాడు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మండల విద్యాశాఖ అధికారి బానోత్ జుంకీలాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ సంబరాలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలోని విద్యా ప్రమాణాలకు ప్రస్తుతం విద్యా ప్రమాణాలకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. ఆనాడు ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేవని, ప్రస్తుతం అన్ని సౌకర్యాలు ఉన్నట్లు చెప్పారు. అనంతరం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన 42 మంది ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానించారు. అంతకముందు జ్యోతి ప్రజల్వన చేసి, డాకర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, ప్రజాకవి కాళోజీ నారాయణారావుల చిత్రపటానికి పూమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ బానోత్ జుంకీలాల్, తహసీల్దార్ శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు లక్ష్మీనర్సయ్య, పి.సంజీవరావు, ఎస్కే మీరా సాహెబ్, కాంగ్రెస్ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మంగీలాల్ నాయక్, బానోత్ లాలు, అల్లాడి నరసింహారావు పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జరిగిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కార్యక్రమానికి ఎమ్మెల్యే రాందాస్ నాయక్ 65 మంది లబ్ధిదారులకు రూ.65.07 లక్షల విలువగల చెక్కులు అందజేశారు. అదేవిధంగా గాంధీనగర్, సురారం గ్రామాలకు చెందిన ఐదుగురు రైతులు ఉపాధి హామీ పథకం నిధులు రూ. 2.71 లక్షలతో నిర్మించిన పశువుల పాకల చెక్కులు అందజేశారు. అదేవిధంగా మండలంలో అత్యధిక పనిదినాలు చేసిన ఉపాధి గ్రూపులకు పలుగు, పారలు పంపిణీ చేశారు.

కాంగ్రెస్‌లో చేరిక..

మండలంలోని చింతలతండా, లైన్‌తండా గ్రామాలకు చెందిన 35 బీఆర్‌ఎస్ పార్టీ కుటుంబాలు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. జూలూరుపాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వీరికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాలోత్ మంగీలాల్ నాయక్, అల్లాడి నరసింహారావు, దుద్దుకూరి మధుసూదన్‌రావు, రాంశెట్టి రాంబాబు, కొలిపాక వెంకటేశ్వర్లు, వేల్పుల నరసింహారావు, లకావత్ లచ్చు నాయక్, బానోత్ లాలు నాయక్, చౌడం నరసింహారావు, కొర్సా రమేష్, ఉసికల వెంకటేశ్వర్లు, తోట శ్రీను, తదితరులు ఉన్నారు.

బ్యాంక్ సేవలు వినియోగించుకోండి..

టేకులపల్లి: ప్రజలు బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ ఘన్‌శ్యాం సోలంకి పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం లచ్చగూడెం గ్రామంలో నిర్వహించిన సెట్యురేషన్ క్యాంప్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు అన్ని గ్రామాలలో ఈ క్యాంప్‌లు నిర్వహిస్తున్నామన్నారు.

ప్రధానమంత్రి జన్‌ధన్ ఖాతాలు, జీవనజ్యోతి బీమా, సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన పథకాలపై అవగాహన కల్పించారు. రీజినల్ మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ పథకాలను ఎస్‌బీఐ ప్రజలకు చేరువ చేస్తుందన్నారు. కలెక్టర్ జిల్లాలోని వివిధ వర్గాల ప్రజలకు మేలు చేసే విధంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నారని, మునగ, చేపల, మేకల, కౌజుపిట్టల, పుట్టగొడుగుల పెంపకం ఇలా ప్రజల ఆదాయాన్ని పెంచే విధంగా కృషి చేస్తున్నారని ఈ ప్రయత్నాలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పూర్తి మద్దతుగా నిలుస్తుందన్నారు. పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై పథకాలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అద్భుతమైన పథకాలనీ, కేవలం సంవత్సరానికి రూ.436తో రూ.రెండు లక్షల జీవిత బీమా మరియు రూ.20తో రూ.రెండు లక్షలతో ప్రమాద బీమా పొందవచ్చని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం 18 నుంచి 70 సంవత్సరాల వయస్సున్న ప్రతీ వ్యక్తికి ఇన్సూరెన్స్ చేయించాలన్న లక్ష్యంతో తమ అన్నిశాఖలు పనిచేస్తున్నట్లు చెప్పారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి, మేనేజర్ భానుపద్మశ్రీ, టేకులపల్లి శాఖ మేనేజర్ ముఖేష్, సెక్రటరీ కవిత, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలి



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి

పాల్వంచరూరల్: ఆది కర్మయోగి అభియాన్ సభ్యులు గిరిజన గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆది కర్మయోగి అభియాన్ సభ్యులకు రెండు రోజులు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ ప్రారంభించారు. మాట్లాడుతూ... గిరిజనుల సంస్కృతి, సంప్రదాయ విలువలు, వారి ప్రత్యేక అవసరాలను గుర్తించే విధంగా విజన్ బిల్డింగ్‌ను రూపొందించాలన్నారు. గిరిజన నాయకులు, ప్రతినిధుల భాగస్వామ్యం ద్వారా గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మండలంలోని ఉల్వనూరు, చంద్రాలగూడెం, కారెగట్టు, పాయకారి యానంబైల్, సూరారం, తోగ్గూడెం, రంగాపురం గ్రామాలను ఎంపిక చేసింది. ఈ గ్రామాల్లో స్కూల్ టీచర్, పంచాయతీ కార్యదర్శి, క్షేత్రసహాయకుడు, ఏఎన్ఎం, గ్రామ సమాఖ్య సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్త, పెసా మొబిలైజర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఏపీఓ పోరండ్ల రంగా, ఏపీఎం, మీరాబీ, శిక్షకుడు ప్రకాశ్‌రావు, హెచ్‌ఎం మాధవీలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలని వివిధ శాఖల అధికారులు సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆది కర్మయోగి అభియాన్‌పై సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలను ప్రజలకు వివరించి సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని, దీనికోసం ప్రతి గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల ఉద్యోగులు భరత్, రాజు, సంపత్, ధనలక్ష్మి, సంపత్, కార్యదర్శులు పాల్గొన్నారు.

సుజాతనగర్: ఆది కర్మయోగి అభియాన్ శిక్షణ తరగతులు స్థానిక రైతు వేదికలో మంగళవారం ప్రారంభించారు. అధికారులు మాట్లాడుతూ ఆది కర్మయోగి అభియాన్‌లో గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఐదేళ్ల ప్రణాళికపై సమగ్ర నివేదికలు తయారు చేయనున్నట్లు తెలిపారు. గిరిజన గ్రామ విజన్–2030 లక్ష్యంతో ప్రజలు, అధికారుల భాగస్వామ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం కోసం మండలంలో సీతంపేట, సర్వారం, సింగభూపాలెం మూడు గ్రామ పంచాయతీలను ఎంపిక చేసినట్లు చెప్పారు.

కొత్తగూడెంఅర్బన్: ఆది కర్మయోగి అభియాన్ ప్రతిస్పందనాత్మక పాలనా కార్యక్రమంలో భాగంగా మంగళవారం లక్ష్మీదేవిపల్లి మండలంలో గ్రామ కార్యదర్శులకు, మెడికల్, ఫారెస్టు, అగ్రికల్చరర్ ఉద్యోగులకు శిక్షణ నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ అన్ని శాఖల పరిపాలన వివరాలతో చైతన్యం చేసేందుకు, మారుమూల గిరిజన గ్రామాలలో చైతన్యం కొరకు ఆది కర్మయోగి కార్యక్రమం భారత ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. ఐటీడీఏ ఏడీపీ ఉదయ్‌కుమార్, ఎంపీడీఓ తాళ్లూరి అంకుబాబు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

టేకులపల్లి: కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రారంభించిన జాతీయ కార్యక్రమం ఆది కర్మయోగి అభియాన్‌పై మంగళవారం టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ రైతు వేదికలో శిక్షణను నోడల్ ఆఫీసర్, ఎంపీడీఓ బైరు మల్లేశ్వరి ప్రారంభించారు. మాట్లాడుతూ ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమానికి జిల్లాలో 19 మండలాల్లోని 130 గ్రామాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ట్రైనర్లు జి.వెంకట్రావు, వజ్జా పార్వతి, డి.రామ్‌చంద్రసింగ్, పి.నాగేశ్వర్‌రావు, కె.అనురాధ, లాలు, మూడు హుస్సేన్ పాల్గొన్నారు.

ఎస్టీ జాబితా నుంచి తొలగించండి..

టేకులపల్లి: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాబురావు సుప్రీంకోర్టులో కేసు వేసిన నేపథ్యంలో ఈనెల 9న కోర్టు తీర్పు రానున్న నేపథ్యంలో తుడుందెబ్బ నాయకులు, ఆదివాసీ ప్రజలు వినూత్న రీతిలో కార్యక్రమాలు చేపట్టారు. ఈ మేరకు మంగళవారం 9న వెలువడే సుప్రీంకోర్టు తీర్పుతో ఆదివాసీలకు న్యాయం జరగాలని కోరుతూ తుడుందెబ్బ జాతీయ కోకన్వీనర్ కల్తి సత్యనారాయణ, వీసాల రవిదొర ఆధ్వర్యంలో మండలంలోని కొప్పురాయి గ్రామంలో గ్రామదేవతలు, బొడ్రాయి వద్ద పూజలు చేశారు. గ్రామంలోని రోడ్డుపై నిలబడి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కొప్పురాయి, ఒడ్డుగూడెం, మోదుగులగూడెం, లక్ష్మీపురం, బర్లగూడెం, ఇప్పలచెలక గ్రామాలకు చెందిన ఆదివాసీలు పాల్గొన్నారు.